నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | HYDERABAD

## ◆ ఎల్లలు దాటిన ప్రేమ



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సోదరుడు దేవిరెడ్డి నారాయణరెడ్డి కుమారుడు డాక్టర్ నితిన్‌రెడ్డి అమెరికాలో డాక్టర్. అక్కడి వైద్యురాలు విట్నీ స్నీడర్‌ను ప్రేమించాడు. పెద్దలను ఒప్పించి.. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఆదివారం గచ్చిబౌలిలోని అడ్రెస్ కన్వెన్షన్‌లో ఇరు కుటుంబాల సమక్షంలో హిందూ సాంప్రదాయ పద్ధతిలో నితిన్, స్నీడర్ వివాహం వైభవంగా జరిగింది.

- ఎల్బీనగర్, ఫిబ్రవరి 18

# బల్దియా బడ్జెట్ ₹8,437 కోట్లు

- రెండు కేటగిరీలుగా పద్దు
- ఏ కేటగిరీలో రూ. 7,937 కోట్లు
- బీ కేటగిరీలో రూ. 500కోట్లు
- గతేడాది కంటే రూ. 2,213కోట్లు అదనం

నేడు కౌన్సిల్‌లో చర్చ..
ఆమోదించనున్న సభ్యులు




సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ముసాయిదాను సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. 2023-24 సంవత్సరానికి బడ్జెట్ రూ. 6,224 కోట్లుగా ప్రతిపాదించగా, రాబోయే ఆర్థిక సంవత్సరానికి అధికారులు రూ. 8437 కోట్లుగా ఖరారు చేశారు. మారిన అవసరాలు, పెరిగిన ఖర్చులు వంటివి దృష్టిలో ఉంచుకొని గతేడాది కంటే ఈ సారిగా అదనంగా రూ. 2,213 కోట్ల పద్దును పెంచారు. గతంలో మాదిరిగానే బడ్జెట్‌ను రెండు భాగాలుగా (ఏ, బీ) రూపొందించారు. ఈ సారి కూడా హెచ్‌ఎంసీది ఏ విభాగం కింద ఉండగా, డబుల్‌బెడ్రూం ఇండ్ల కోసం అందే నిధులను 'బీ' కేటగిరీగా చేర్చారు. ఏ కేటగిరీలో రూ.7,937కోట్లు, 'బీ' కేటగిరీలో డబుల్ బెడ్రూం ఇండ్లకు రూ. 500 కోట్లు కేటాయించారు. కాగా, కౌన్సిల్‌లో ఈ బడ్జెట్ ప్రతిపాదనపై సభ్యులు విస్తృతంగా చర్చించనున్నారు. ఆ తర్వాత కౌన్సిల్ సభ్యులు ఆమోదించిన తర్వాత అధికారులు ఈ బడ్జెట్ ప్రతిపాదనను ప్రభుత్వానికి అందజేసి అనుమతి తీసుకుంటారు.

**జీహెచ్‌ఎంసీ బడ్జెట్ (రూ.కోట్లు)**

| హెడ్ ఆఫ్ అకౌంట్ | 2023-24 ఆర్థిక సంవత్సరం | 2024-25 ఆర్థిక సంవత్సరం |
|---|---|---|
| రెవెన్యూ ఆదాయం | 3,967 | 5,938 |
| రెవెన్యూ వ్యయం | 2,667 | 3,458 |
| రెవెన్యూ మిగులు | 1,300 | 2,480 |
| క్యాపిటల్ నిధులు | 3,557 | 4,479 |
| క్యాపిటల్ వ్యయం | 3,557 | 4,479 |



# 23 ప్రశ్నలతో రెడీ

### నేడు మేయర్ అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం


### ప్రజా సమస్యలు, అక్రమాలు, అవినీతిపై గళ మెత్తనున్న సభ్యులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జీహెచ్ ఎంసీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరగనున్నది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కౌన్సిల్ సమావేశంలో అన్ని పార్టీలకు చెందిన 147 మంది కార్పొరేటర్లతో పాటు ఎక్స్ ఆఫిషియో సభ్యులు పాల్గొని ప్రజా సమస్యలపై గళం విప్పనున్నారు. డిసెంబర్ మొదటి వారం తర్వాత జరగాల్సిన కౌన్సిల్ సమావేశం కమిషనర్ రోనాల్డ్ రాస్ వైఖరితో జాప్యం జరిగింది. చివరకు మేయర్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడం..బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వంటి చర్యలతో వెనువెంటనే కౌన్సిల్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. మొత్తంగా గడిచిన ఐదు నెలలుగా అభివృద్ధి పనులు అటకెక్కడం, కొత్త ప్రాజెక్టులు లేకపోవడం, అపరిష్కృత సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశం వైపు ఎదురుచూసిన పరిస్థితి. నేటి కౌన్సిల్ సమావేశం వాడీవాడీగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

#### స్వల్ప మార్పులు

జీహెచ్‌ఎంసీలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు 54, ఎంఐఎం 42, బీజేపీ 40, కాంగ్రెస్ 11 (మూడు డివిజన్లలో ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది) మంది ఉండగా...అన్ని పార్టీలకు కౌన్సిల్ సమావేశంలో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. 11 మంది సభ్యులున్న అధికార పార్టీ కాంగ్రెస్ కార్పొరేటర్లతో పాటు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లకు ప్రజల సమస్యలపై మాట్లాడనున్నారు. 23 ప్రశ్నలతో సభ్యులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధానంగా శానిటేషన్, రాంకీ నిర్వహణ, వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న అక్రమాలు, జీహెచ్‌ఎంసీకి భారంగా మారుతున్న డిప్యూటేషన్లు, స్వీపింగ్ యంత్రాల్లో జరుగుతున్న అవినీతి, ప్రకటనల విభాగంలో, సీఆర్‌ఎంపీ రోడ్ల నిర్వహణ, ట్యాక్స్ (రెవెన్యూ)లో, టౌన్‌ప్లానింగ్, నాలాల అక్రమణలపై అధికారుల లోపాలను ఎత్తిచూపనున్నారు. అయితే సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు ఏ మేరకు సమాధానం చెబుతారో అన్నది ఆసక్తికరంగా మారింది. సమావేశం సాయంత్రం వరకు జరిగే అవకాశం ఉండగా..చివరలో బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించి ఆమోదించనున్నారు. కాగా, కౌన్సిల్‌లో సభ్యులు కూర్చునే సీటింగ్ కేటాయింపులో స్వల్ప మార్పులు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్ సభ్యులకు ప్రాముఖ్యత ఇచ్చారు. ఇది వరకు ముగ్గురు సభ్యులు మాత్రమే ఆ పార్టీకి ఉండగా.. తాజాగా చేరికలతో 11 మంది వరకు కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉన్నారు. దీంతో ఆ పార్టీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈ మార్పులు చేశారు.

# అంతరాయం.. నిరంతరం



### గంట గడిచినా.. విద్యుత్ పునరుద్ధరణ ఉండట్లే

### క్షేత్ర స్థాయిలో కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

### మరమ్మతుల్లో విద్యుత్ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం

**తరచూ అంతరాయాలతో జనం అవస్థలు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): కరెంటు పోయిందా.. ఇక అంతే సంగతులు.. ఎప్పుడు వస్తుందోనని వేచిచూడాల్సిందే. గంట గడిచినా.. పునరుద్ధరణ ఉండటం లేదు. గ్రేటర్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థ ప్రస్తుత తీరిది. అధికారికంగా ఎలాంటి కరెంటు కోతలు లేకపోయినా..సబ్ స్టేషన్లలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఉన్నా... క్షేత్ర స్థాయిలో అంతరాయాలు నిత్యకృత్యం అన్నట్లు మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఇండ్లకు వెళ్తున్న లైన్లలోనే ఉత్పన్నమవుతున్న సమస్యను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. స్థానికంగా అకస్మాత్తుగా సరఫరా నిలిచిపోతే దాని పునరుద్ధరించేందుకు సిబ్బంది గంటల తరబడి సమయం తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువయ్యాయి. కరెంటు సరఫరా నిలిచిపోయిందని అనేకసార్లు ఫోన్లు చేస్తే తప్ప.. క్షేత్రస్థాయిలోని సిబ్బంది స్పందించడం లేదని నగరంలోని పలు కాలనీ వాసులు వాపోతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో ఈ సమస్యను గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఎదుర్కొంటున్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెబుతున్నారే తప్ప.. అలాంటి పరిస్థితి క్షేత్ర స్థాయిలో ఉండటం లేదని, కరెంటు పోవడం, రావడం షరా మామూలై పోయిందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఫ్యూజ్ పోతే దాన్ని సరిచేసేందుకు 10-15 నిమిషాలు పడితే, ఎమర్జెన్సీ బృందాలు రావడానికి మాత్రం గంట పైనే పడుతోందని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

#### గ్రేటర్‌లో 9 సర్కిళ్లు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు మొత్తం 9 సర్కిళ్లను, వాటి పరిధిలో డివిజన్స్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి సెక్షన్ పరిధిలో క్షేత్ర స్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు లైన్‌మెన్‌లు, వారికి సహాయకులుగా హెల్పర్లు (ఆర్టిజన్స్) విధుల్లో ఉంటున్నా.. విద్యుత్ అంతరాయం విషయంలో తలెత్తున్న సమస్యలపై అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా కొత్త కనెక్షన్లు ఇవ్వడంలో చూపుతున్న ఆసక్తిని విద్యుత్ సరఫరా విషయంలో జరుగుతున్న అంతరాయంపై సెక్షన్ అధికారులు చూపడం లేదు. కాలనీల్లో ఆకస్మాత్తుగా కరెంటు పోతే పునరుద్ధరించేందుకు వినియోగదారులు సెక్షన్ కార్యాలయానికి ఫోన్ చేస్తే ఎమర్జెన్సీ బృందాలకు ఫోన్ చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. సమస్యను ఎమర్జెన్సీ బృందాలకు చెబితే తాము వేరే ఫిర్యాదు వస్తే దాన్ని సరిచేసి వస్తామని, సమయం పడుతుందంటూ ఫోన్ పెట్టేస్తున్నారు. ప్రతి సెక్షన్ పరిధిలో ఉండే లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, వారికి సహాయకులుగా ఉండే హెల్పర్లు విధుల్లో ఉంటున్నా.. వారు మాత్రం సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.




చివరి రోజు నుమాయిష్‌కు భారీగా తరలివచ్చిన సందర్శకులు

# 49 రోజులు.. 24 లక్షలు

**చివరి రోజు దాదాపు 80 వేలకు పైగా సందర్శకులు**

**ముగిసిన నుమాయిష్**

అబిడ్స్, ఫిబ్రవరి 18 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన నుమాయిష్ ఆదివారంతో ముగిసింది. 49 రోజులుగా జరిగిన ఈ ఎగ్జిబిషన్‌ను దాదాపు 24 లక్షల వరకు సందర్శకులు సందర్శించారు. చివరి రోజు దాదాపు 80 వేలకు పైగా సందర్శించారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్‌సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందర్‌కుమార్ నేతృత్వంలో ప్రతినిధులు అన్ని చర్యలు తీసుకున్నారు. ఎగ్జిబిషన్ సాఫీగా సాగేందుకు పలు సబ్ కమిటీలను ఏర్పాటు చేసి.. వాటి ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహించారు. 1938లో మొదట పబ్లిక్ గార్డెన్స్‌లో వంద స్టాళ్లతో ప్రారంభించిన నుమాయిష్.. క్రమ, క్రమంగా ప్రజాదరణ పొందింది. నుమాయిష్ నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ వర్గాలు తెలంగాణ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో కళాశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నాయి.



నుమాయిష్‌లో సందడి చేస్తున్న సందర్శకులు

# ఐటీ అభివృద్ధికి డబ్ల్యూటీఐటీసీ కృషి

### చైర్మన్ సందీప్ మక్తల

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐటీ రంగం అభివృద్ధికి వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ (డబ్ల్యూటీఐటీసీ) పనిచేస్తోందని చైర్మన్ సందీప్ మక్తల తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులను కలిసి వారితో తెలుగు రాష్ట్రాల్లో ఐటీ రంగానికి మేలు చేసేందుకు ఉన్న అవకాశాలను గుర్తించే కార్యక్రమంలో భాగంగానే ఆదివారం ఆఫ్రికా డబ్ల్యూటీఐటీసీ సమ్మిట్‌ను నిర్వహించామన్నారు. దక్షిణాఫ్రికాలోని భారత కౌన్సిల్ కార్యాలయంలో కౌన్సిల్ జనరల్‌తో డబ్ల్యూటీఐటీసీ బృందం సమావేశమై ఇరు దేశాల మధ్య టెక్నాలజీ అంశాల్లో సమన్వయం, వ్యాపార అంశాల్లో పరస్పర ప్రయోజనాలు, నూతన వ్యాపార అవకాశాల అన్వేషణ వంటివి చర్చించామన్నారు. సమావేశంలో డబ్ల్యూటీఐటీసీ ప్రతినిధులు కిశోర్ పుల్లూరి, నాగరాజ్ గుర్రాల, రెలాన్ రంజన్, ప్రవీణ్ మీరెడ్డి, వెంకట్ ఓరుగంటి, జయదీప్, విక్రాంత్‌మూల, తుమ్మల గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# కొర్రీలతో కాలయాపన..!

- ఆన్‌లైన్ విధానం ఉన్నా.. ఆఫ్‌లైన్‌లో కలవాల్సిందే
- ఇంటి అనుమతుల్లో తీవ్ర జాప్యం
- ఆఫీసు చుట్టూ తిరిగేలా చేస్తున్న హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం
- షార్ట్‌ఫాల్స్ పేరుతో తాత్సారం
- మధ్యాహ్నం 3 తర్వాతే కలవాలని నిబంధన
- దరఖాస్తుదారులకు ఇబ్బందులు
- టీఎస్ బీపాస్‌ను సరిగ్గా అమలు చేయని అధికారులు

hmda Growing Global

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): సామాన్యుడి సొంతింటి కలను నిజం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నానికి హెచ్‌ఎండీఏ టౌన్‌ప్లానింగ్ అధికారులు అడుగడుగునా కొర్రీలు పెడుతున్నారు. త్వరగా ఇంటి అనుమతి కావాలంటే తాము అడిగినంత ఇవ్వాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందేలా టీఎస్ బీ పాస్ పాలసీని తీసుకొచ్చింది. అన్ని పత్రాలు ఉంటే ఇన్‌స్టంట్ అప్రూవల్ పొందే అవకాశం కల్పించింది. అదేవిధంగా 21 రోజుల్లోనే 240 గజాల లోపు స్థలాల్లో నిర్మించే భవనాలకు అనుమతులు పొందవచ్చు. అయితే ప్రస్తుతం ఈ పాలసీని ప్లానింగ్ విభాగం అధికారులు సరిగ్గా అమలు చేయడం లేదని, అదేవిధంగా లే అవుట్ల అనుమతుల విషయంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఇంటి అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానం ఉన్నా... పట్టించుకోవడం లేదు. ఆఫ్‌లైన్‌లో వచ్చి కలవాల్సిందే అన్నట్లు షార్ట్‌ఫాల్స్ పేరుతో కాలయాపన చేస్తున్నారు. దరఖాస్తుదారు లేదంటే అతడి తరపున ఆర్కిటెక్ట్, ప్లానర్, లైజనింగ్ చేసే మధ్య దళారి... ఇలా ఎవరైనా వచ్చి సంబంధిత ప్లానింగ్ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకున్న ఇంటి వివరాలను చెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది.

#### మధ్యాహ్నం 3 తర్వాతే..

హెచ్‌ఎండీఏ పరిధిలో ఇండ్ల నిర్మాణం చేపట్టే వారంతా అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్సులో హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయానికి రావాల్సిందే. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు చుట్టూ పక్కల ప్రాంతాల్లోనే ఎక్కువగా నిర్మాణాలు జరుగుతుండడంతో ఇక్కడి వారంతా 20-30 దూరంలో ఉన్న అమీర్‌పేటకు రావాల్సి వస్తున్నది. పైగా ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా మధ్యాహ్నం 3 గంటల తర్వాతే రావాలన్న నిబంధన పెట్టారు. పరిపాలనా సౌలభ్యం కోసం హెచ్‌ఎండీఏ పరిధిలో 4 జోన్లుగా విభజించారు. ఇందులో శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్లు ఉండగా, ఆయా జోన్ల పరిధిలోని ప్రాంతాల నుంచి దరఖాస్తుదారులు నిత్యం వందలాది మంది ప్లానింగ్ విభాగానికి వస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ఆ విభాగం మార్కెట్‌ను తలపిస్తున్నది. చాంబర్లలో కుర్చీల నిండా, క్యాబిన్స్ వద్ద ఏపీవో, జేపీవో, సెక్షన్ అధికారుల వద్ద పడిగాపులు కాస్తూ అనుమతుల విషయాన్ని ఆరా తీస్తూ కనిపిస్తూ ఉంటున్నారు.

#### అనుమతి ఇస్తేనే..

హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలోకి వెళ్లాలంటే పోలీసు శాఖ హోంగార్డు లేదా కానిస్టేబుల్, ప్రైవేటు సెక్యూరిటీ గార్డు అనుమతివ్వాల్సిందే. అంతేకాదు వచ్చిన వారంతా రిజిస్టర్‌లో పేరు రాసి సంతకం పెట్టిన తర్వాతే అనుమతిస్తున్నారు. ఇంటి నిర్మాణ అనుమతుల్లో సులభమైన విధానం అమల్లో ఉన్నా... దరఖాస్తుదారులు హెచ్‌ఎండీఏ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఎందుకని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న పని విధానం, ఇండ్ల నిర్మాణ అనుమతుల కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి, వారికి సత్వరమే నిబంధనలకు ప్రకారం ప్లానింగ్ అధికారులు టీఎస్ బీ పాస్ నిబంధనల్లో సూచించినట్లు నిర్ణీత సమయాల్లో అనుమతులు జారీ చేయాలని కోరుతున్నారు.



## చీరకట్టులో క్యూట్ లుక్స్

బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి హాజరైన నటి, యాంకర్ స్రవంతి సందడి చేసింది. చీరకట్టులో క్యూట్ లుక్స్‌తో అభిమానులను ఫిదా చేసింది. ఫొటోలకు పోజులిస్తూ.. హొయలుపోయింది.

-బంజారాహిల్స్, ఫిబ్రవరి 18